క్లుప్తంగా

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

తిరుపతి తుడా : ఆధార్ నమోదుకు నగరంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 6 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించుకోవచ్చని వెల్లడించారు. తొలి దశలో ఈ నెల 21వ తేదీ వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. రెండో విడత కింద ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మేరకు నగరంలోని దోబీ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, సప్తగిరి నగర్, భవానీ నగర్, యశోదా నగర్, పూసల వీధి, వినాయక నగర్, తాతానగర్, ఎస్టీవీ నగర్, నవాబుపేట ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని వివరించారు.

ఆధార్ కేంద్రాల తనిఖీ



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

తిరుపతి రూరల్ : మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను డీఎల్‌డీఓ నారాయణరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవిలాల సెంటర్‌లో చిన్నారులకు ఆధార్ నమోదును పరిశీలించారు. అలాగే శిబిరంలో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. తిరుపతి రూరల్ మండలంలో ఏర్పాటు చేసిన మూడు ఆధార్ నమోదు సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్య జీవనం



ర్యాలీ ప్రారంభిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి సిటీ : సైక్లింగ్‌తో ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ తెలిపారు. ఫిట్ ఇండియా సైక్లింగ్ ఉద్యమంలో భాగంగా మంగళవారం వర్సిటీలో సుమారు 300 మంది విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి దినచర్యలో సైక్లింగ్ భాగం కావాలన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకే కేంద్ర ప్రభుత్వం ఫిట్ ఇండియా సైక్లింగ్ ఇన్ ట్యూస్‌డేస్ అనే ఉద్యమానికి పిలుపునిచ్చిందని వెల్లడించారు. ప్రతి మంగళవారం వర్సిటీలో సైక్లింగ్ కొనసాగిస్తామని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజనీ, పీఈడీ ప్రొఫెసర్ సరోజిని పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థిని సిరితో ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని సిరి రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సుజనాకుమారి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినికి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ శైలేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు వాసు, రవికుమార్, సునీత, రజనీ ఉన్నారు.

యాజమాన్యంతో అధిక దిగుబడి



పొలం పిలుస్తోందిలో అధికారులు, రైతులు

భాకరాపేట : సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం భాకరాపేట, ఎర్రావారిపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిలో సమగ్ర పోషణతో సాగు ఖర్చులు సైతం తగ్గుతాయని వెల్లడించారు. వ్యవసాయాధికారి కేవీ శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. వ్యవసాయధికారి ఖాదర్‌బాషా, ధనలక్ష్మి, రైతు సేవా కేంద్రం సిబ్బంది మునిశేఖర్, భానుప్రకాష్, రాజశేఖర్, తేజస్విని, జాహ్నవి, నళినీదేవి పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

తిరుమల : నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించి శ్రీవారి దర్శనానికి టికెట్లు పొందిన ముగ్గురు నిందితులను తిరుమల వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ వి. విశ్వేశ్వర ప్రసాద్ ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిలటరీ క్యాంటీన్‌లో సౌత్ జోన్‌కు పనిచేస్తున్నారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం తమ క్యాంటీన్‌లకు నిత్యావసరాలు సరఫరా చేసే చెన్నైకి చెందిన సతీష్‌ను సంప్రదించాడు. వీఐపీ బ్రేక్ దర్శనం చేయిస్తానని సతీష్ రూ.40వేలు తీసుకున్నాడు. అనంతరం వి. విశ్వేశ్వర ప్రసాద్ తన ఐడీ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు పంపాడు. అనంతరం సతీష్ తిరుపతి ఆర్మీ క్యాంటీన్లో పనిచేస్తున్న బ్రహ్మయ్యతోపాటు, పి. చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తులతో కలిసి విశ్వేశ్వర ప్రసాద్ పేరుతో బ్రిగేడియర్ హోదాకి నకిలీ ఐడీ కార్డు తయారుచేశాడు. వీఐపీ ప్రోటోకాల్ దర్శనం టికెట్లు తీసుకున్నాడు. ఈ విషయాన్ని టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నిందితులను పట్టుకుని తిరుమల వన్ టౌన్ పీఎస్ పోలీసులకు అప్పగించారు.

ఏనుగుల సంచారంతో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు వణికిపోతున్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామస్తులు గజగజలాడుతున్నారు. ప్రధానంగా రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట నాశనమవుతుంటే కన్నీరు పెడుతున్నారు. గజ బీభత్సం నుంచి కాపాడేవారి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అండగా నిలిచిన అధికారులు ఇప్పుడు ముఖం చాటేస్తుంటే ఆవేదనకు గురవుతున్నారు. ఫారెస్ట్ సిబ్బంది స్పందించి భీ'కరి' గుంపును అడవిలోకి మళ్లించాలని వేడుకుంటున్నారు.

- చంద్రగిరి నియోజకవర్గంలో ఏనుగుల హల్‌చల్
- గజ బీభత్సంతో పంటల ధ్వంసం
- రైతులకు భరోసా కల్పించని అధికార యంత్రాంగం
- గత ప్రభుత్వంలో అండగా నిలిచిన అటవీశాఖ

భాకరాపేటలో ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)



భీకరి.. కాపాడేవారేరి?

భాకరాపేట : చంద్రగిరి నియోజక వర్గంలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, చంద్రగిరి మండలంలో ఏనుగుల విధ్వంసం అధికంగా ఉంటుంది. అటవీప్రాంతానికి సమీపంలో ఉండడంతో గజరాజులు తరచూ ఈ మండలాల్లోకి ప్రవేశిస్తుంటాయి. పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను ఆరగించడంతోపాటు తొక్కి నాశనం చేస్తుంటాయి. అన్నదాతలను నష్టాల బారిన పడేస్తుంటాయి. ఈ క్రమంలోనే ఎర్రావారిపాళెం మండలంలో ఓ గిరిజనుడిని సైతం తొక్కి చంపేశాయి.

మళ్లీ హల్‌చల్

ఇటీవల నుంచి ఏనుగుల సంచారం చంద్రగిరి నియోజకవర్గంలో అధికమైంది. తలకోన అడవిలో మేత, నీరు సమృద్ధిగా ఉండడంతో గజరాజులు అటవీప్రాంత సరిహద్దుల్లోనే మకాం వేశాయి. అక్కడ నుంచి సమీప గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల ఒక ఏనుగు ప్రమాదవశాత్తు మరణించడంతో గుంపులోని మిగిలినవి మరింతగా రెచ్చిపోతున్నాయి. ఏనుగుల బీభత్సం భరించలేక అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఏమాత్రం స్పందన లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఏనుగుల గుంపును అడవిలోకి దారి మళ్లించి తమ పంటలను రక్షించాలని వేడుకుంటున్నారు.

> **ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం**
>
> ఏనుగుల హల్‌చల్ ఇటీవల పెరిగింది. వాటిని అడవిలోకి మళ్లించేందుకు చర్యలు చేపడతాం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళతాం. రైతులకు అండగా ఉంటాం. వారికి నష్టపరిహారం ఇప్పించేందుకు సహకారం అందిస్తాం.
>
> – వెంకటరమణ, ఫారెస్ట్ రేంజర్, భాకరాపేట

రెండేళ్ల క్రితం ప్రత్యేక ఆపరేషన్

ఏనుగుల దాడులను అరికట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కట్టుదిట్టంగా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవ మేరకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. గజరాజులను అడవిలోకి దారి మళ్లించేందుకు తిరుపతి జూపార్క్ నుంచి గణేష్, కుప్పం ననియాల నుంచి జయం, వినాయక పేర్లు గల కుంకీ ఏనుగులను రప్పించారు. వాటి సాయంతో రాత్రింబవళ్లు పొలాల వెంటే సాగుతూ ఎక్కడికక్కడ ఏనుగుల గుంపును తరమివేసే ప్రక్రియ చేపట్టేవారు. దీంతో చాలా వరకు రైతులకు ఉపశమనం లభించేది. ఎక్కడైనా పంట నష్టపోయినా త్వరితగతిన పరిహారం అందేది. ఈ క్రమంలోనే మొత్తం ఆపరేషన్‌ను అటవీశాఖ అధికారులు దాదాపు నెల రోజులు చేపట్టారు. ఏనుగుల మందను అడవిలోకి మళ్లించారు.



కుంకీ ఏనుగులు జయం, వినాయక (ఫైల్)

ఎస్వీయూ హాస్టళ్ల తనిఖీ



హాస్టల్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని విద్యార్థినుల హాస్టళ్లను వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులకు వెళ్లి ఆహార పదార్థాలను రుచి చూశారు. వంటశాల, మెస్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిద్ధం చేసిన ఆహారం పూర్తిగా ఖాళీ అయ్యేంత వరకు విద్యార్థినులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, వార్డెన్లు ఆచార్య నాగజ్యోతి, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

తిరుపతి కల్చరల్ : స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మబ్బు సూర్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ సేవా దృక్పథంతో ట్రస్ట్ నిర్వాహకులు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెట్విన్ సీఈఓ కె.మోహన్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉచిత టైలరింగ్ శిక్షణ ద్వారా సుమారు 300 మందికి అవకాశం కల్పించామని తెలిపారు. శిక్షకులు తులసి, ప్రియ, కో–ఆర్డినేటర్ రేవంత్ పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులపై సమీక్ష



అధికారులకు సూచనలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన పనుల పురోగతిపై కార్పొరేషన్ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండీ మౌర్య మంగళవారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గడువులోపు అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలస్యమవుతున్న పనులపై ఆరా తీశారు. పాత మున్సిపల్ కార్యాలయ స్థానంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ (నగరపాలక సంస్థ కార్యాలయం) నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. గరుడ వారధిలో పెండింగ్ పనులు, కొర్లగుంట వద్ద డ్రైనేజీ కాలువల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మల్టీలెవల్ కార్ పార్కింగ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వినాయక సాగర్ గ్లో గార్డెన్, క్రికెట్ స్టేడియంలో పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, ఈఈ చంద్రశేఖర్, డీఈలు రాజు, మధు, వెంకట ప్రసాద్, డీసీపీ మహాపాత్ర, స్మార్ట్ సిటీ ఏఓ రాజశేఖర్, సీఎఫ్ఓ మల్లికార్జున, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, అనిల్ పాల్గొన్నారు.

ప్రణాళికతో సుస్థిర అభివృద్ధి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సురేష్‌నాయుడు

తిరుపతి రూరల్ : ప్రణాళికతోనే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని డీఎల్‌పీఓ సురేష్ నాయుడు తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో 'స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు'పై పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులను గుర్తించడంతో పాటు వాటిని పూర్తి చేసేందుకు ఆర్థిక ప్రణాళిక ముఖ్యమన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ప్రాధాన్యతలకు అనుగుణంగా పనులకు నిధులు కేటాయించాలని సూచించారు. అనంతరం ఆర్థిక ప్రణాళిక, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై డీఎల్‌డీఓ నారాయణరెడ్డి, ఈటీసీ ప్రిన్సిపల్ నాగపద్మజ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న తిరుపతి డీఈఓ కేవీఎస్ కుమార్

రామచంద్రాపురం: విద్యా నైపుణ్యాలపై ఇస్తున్న శిక్షణను టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి డీఈఓ కేవీఎస్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సి.రామాపురం సమీపంలోని వెరిటాస్ సైనిక్ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ తరగతులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన 253 మంది ఉపాధ్యాయులకు 6 రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ శివశంకరయ్య, ఏఎస్ఓ సారథి, చంద్రగిరి ఎంఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి శైలజ

చంద్రగిరి : వర్షాల కారణంగా మామిడి పూత ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని, రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానశాఖ అధికారి శైలజ తెలిపారు. మంగళవారం అనంత గుర్రప్రగారపల్లెలోని మామిడి తోటలను ఆమె పరిశీలించారు. పూత సకాలంలో వచ్చేందుకు 13:0:45– 10 గ్రాములు, బోరాన్ –1 గ్రాము, క్లోరోపైరిఫాస్ 50శాతం, ఈసీ–2 మి.లీ, కాపర్ అక్సీ క్లోరైడ్– 3 గ్రా, బంక లేదా జిగురు 0.5 మి. లీ. ఒక లీటరు నీటికి కలిపి చెట్టు కాండం, కొమ్మలకు పిచికారీ చేయాలన్నారు. 10 రోజుల తర్వాత పూత రాకుంటే 13:0:45–10 గ్రాములు, ఫార్ములా 4–2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

మహనీయులు సాధు సుబ్రమణ్యాశాస్త్రి



శాస్త్రి విగ్రహానికి పూలమాల వేస్తున్న టీటీడీ అధికారులు, శాస్త్రి మనవడు, కుమార్తె

తిరుపతి కల్చరల్: శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి, ఆలయ చరిత్ర, శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సాధు సుబ్రమణ్యం శాస్త్రి అని ప్రముఖ పరిశోధకుడు కృష్ణారెడ్డి తెలిపారు. సాధు సుబ్రమణ్యశాస్త్రి 136వ జయంతి సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆలయ చరిత్ర వెలికి తీసిన శాస్త్రి స్వామివారికి అనన్యసేవ చేశారన్నారు. భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని ఆలయానికి అందించారని, ఆయన వెలికి తీసిన తొలి శాసనమే శ్రీవారి ఆలయ చరిత్ర బయటకు రావడానికి కారణమన్నారు. టీటీడీలో చిన్న స్థాయి అధికారంగా ఉంటూ వెయ్యికిపైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి ఆయన అని కొనియాడారు. టీటీడీకి చేసిన సేవలకు గుర్తుగా ఏటా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరపడం ఆనందంగా ఉందన్నారు. డీపీపీ ప్రాజెక్టు అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ సాధు సుబ్రమణ్యశాస్త్రి శ్రీవారి ఆలయ పేష్కార్‌గా ఉంటూ ఎపి గ్రఫిస్టుగా రాగిరేకుల శాసనాలను సేకరించి, అనువదించినట్లు తెలిపారు. ఆయన సేవలను ఏటా స్మరించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీపీ ప్రాజెక్టు అధికారి రాజగోపాల్, శాస్త్రి మనవడు, జిల్లా జడ్జి సీఎస్.మూర్తి, కుమార్తె సాధు గిరిజ పాల్గొన్నారు.

ఘనంగా పుష్పాంజలి

అంతకు ముందు శ్వేత భవనం ఎదురుగా ఉన్న సాధు సుబ్రమణ్యశాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. శాస్త్రి మనవడు, జిల్లా జడ్జి సీఎస్.మూర్తి మాట్లాడుతూ తిరుమలకు సంబంధించి అనేక చారిత్రక, సాంస్కృతిక శాసనాలను వెలుగులోకి తీసుకువచ్చిన ఘనత శాస్త్రికి దక్కుతుందన్నారు. శాస్త్రి కుమార్తె సాధు గిరిజ మాట్లాడుతూ శాస్త్రి తిరుమల శ్రీవారిపై భక్తితో అనేక శాసనాలను అందరికీ అందుబాటులోకి తెచ్చారని తెలిపారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

పాకాల : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీడీఓ అరుణ మాట్లాడుతూ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్, ఎస్ఎస్ఏలో మొత్తం 1,262 పనులు పూర్తి చేశామని, ఇందుకోసం రూ.6.88 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. పీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ మద్దినాయనపల్లె, ఆదినపల్లె, గానుగపెంట గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని వెల్లడించారు. ఈ మేరకు రూ.89,060 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, ఏపీడీ రెడ్డెప్ప, విజిలెన్స్ అధికారి శివయ్య, ఏపీఓ కల్యాణి పాల్గొన్నారు.

ముగ్గురు బాలకార్మికుల గుర్తింపు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేణిగుంట: పట్టణంలోని వివిధ షాపుల్లో పని చేస్తున్న ముగ్గురు బాలకార్మికులను మంగళవారం తిరుపతి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ గుర్తించి, వారికి వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించారు. ఆపరేషన్ స్వేచ్ఛ–4లో భాగంగా మంగళవారం కార్మిక శాఖ, పోలీసు, చైల్డ్ లైన్, ఐసీడీఎస్, ప్రగతి సంస్థలు షాపుల తనిఖీలు చేపట్టాయి. 18 ఏళ్ల లోపు బాల కార్మికులు ముగ్గురిని గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి బాలకార్మికులను పనిలో పెట్టుకుని వెట్టి చాకిరీ చేయిస్తున్న దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ ఎస్.చిన్న లాలెప్ప, అధికారులు శ్రీమన్నారాయణ, రాజ య్య, ప్రవీణ్ కుమార్, రంగనాథ్, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, ఎంఈఓ ఇందిరాదేవి, ఏఎస్ఐ పార్వతి, శ్రీధర్, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

దుకాణాలకు టెండర్లు ఖరారు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలోని పది దుకాణాలకు టెండర్లకు నోటిఫికేషన్ ఇవ్వగా అనూహ్య స్పందన లభించింది. మంగళవారం టెండర్ సీల్డ్ కవర్లు ఓపెన్ చేయగా అధికంగా కోడ్ చేసిన పది మంది దుకాణాలను దక్కించుకున్నారు. 10 దుకాణాలకు 196 దరఖాస్తులు రావడం విశేషం. ఓపీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న క్యాంటీన్‌ను ఏకంగా రూ.1.60లక్షలకు దక్కించుకోవడం గమనార్హం.

చిరుత సంచారంపై అప్రమత్తం

తిరుపతి సిటీ : వేదిక్ వర్సిటీ ప్రాంగణంలో చిరుత సంచారంపై టీటీడీ, ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమయ్యారని, నిత్యం పర్యవేక్షిస్తున్నారని వర్సిటీ పీఆర్ఓ ప్రొఫెసర్ బ్రహ్మాచార్యులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5గంటల తర్వాత వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు సంచరించకుండా జాగ్రత్తలు చేపట్టామన్నారు. విజిలెన్స్ సిబ్బంది సైతం పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారని వివరించారు.

బంగ్లాదేశ్‌లో దాడులు దారుణం

తిరుపతి కల్చరల్ : బంగ్లాదేశ్‌లో హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులపై దాడులు చేయడం దారుణమని, అక్కడ వారికి రక్షణ కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన వహించిన సమావేశానికి వక్తలుగా విశ్రాంత న్యాయమూర్తి పి.గురప్ప, సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పి.అంజయ్య, రైతు సంఘ నేత మాంగాటి గోపాల్‌రెడ్డి, కార్మిక సంఘ నేతలు రాధాకృష్ణ, జి.బాలసుబ్రమణ్యం పాల్గొని ప్రసంగించారు. మైనారిటీలపై దాడులు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం



వైఎస్సార్‌సీపీ నేతలతో భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ప్రజా సమ్యలపై నేతలు, కార్యకర్తలతో కలిసి పోరాటం సాగిస్తామని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పద్మావతిపురంలోని తన నివాసంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నేతలతో సమావేశం నిర్వహించారు. అభినయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా తిరుపతిలో చిన్నపాటి అభివృద్ధి పనులు కూడా చేపట్టడం లేదని, దీంతో నగరవాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీటమునిగితే, కనీసం పలకరించే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశేషంగా తిరుపతిని అభివృద్ధి పథంలో నడిపించామని వెల్లడించారు. కూటమి నేతలు కక్షసాధింపులకు పాల్పడడం, అక్రమ కేసులు బనాయించడం తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతల అరాచకాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ ఎస్‌కే బాబు, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటరెడ్డి, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, పార్టీ నేతలు తాలూరి ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



మాట్లాడుతున్న మనోహరం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ శిరీష, వేదికపై ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్ : నరసింహతీర్థం రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్‌లో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించిన పెన్షనర్ల సంక్షేమాన్ని కాంక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. వారి సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించిన పెన్షనర్లు అభినందనీయులని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు మార్కొండరెడ్డి, ఆర్‌డీ సుబ్రమణ్యం, ఎ.రామకృష్ణయ్య, జె.రామలింగారెడ్డి, ఆర్.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి సిటీ : ఉద్యోగ విరమణ అనంతరం ప్రశాంత జీవనం గడపడానికి పెన్షన్ దోహదపడుతుందని విశ్రాంత ఆర్పీఎఫ్ ఉద్యోగుల అసోసియేషన్ తిరుపతి శాఖ కార్యదర్శి, విశ్రాంత సీఐ మనోహరం తెలిపారు. మంగళవారంఆర్‌పీఎఫ్ బ్యారక్స్‌లో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ప్రెసిడెంట్ వి.శ్రీధర్‌రెడ్డి, సభ్యులు శ్రీహరి, గోవర్ధన్ , చంద్రయ్య, పి.కన్నయ్య పాల్గొన్నారు.

చంద్రగిరి : జమండ్లవీధిలోని విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. చంద్రగిరి సబ్ ట్రెజరీ అధికారి యోగానంద రెడ్డి, హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పోర్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సీతారామిరెడ్డి, త్యాగరాజులు, యారాశి చంద్రశేఖర్ రెడ్డి, బోడిరెడ్డి నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

పాకాల : స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్లో రైల్వే పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎ.ఆల్బర్ట్, జి.జయంతికుమార్, సత్యనారాయణశెట్టి, రాము, బాషా పాల్గొన్నారు.

'భవిత' సేవలపై సంతృప్తి

చంద్రగిరి : స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు అందించిన సేవలను సవిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బాలికల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను తనిఖీ చేశారు. కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఎంఈఓ భాస్కర్, హెచ్‌ఎం వెంకటరమణ రెడ్డి, టీచర్లు వెంకట రాజేశ్వరి, శ్యామలదేవి పాల్గొన్నారు.

'దేవుడున్నాడు జాగ్రత్త' పరిచయం

తిరుపతి కల్చరల్: టీటీడీ చరిత్రతత పాటు ఆగమ శాస్త్రాలలో జరుగుతున్న తప్పులను ఎత్తిచూపుతూ రచించిన 'దేవుడున్నాడు జాగ్రత్త' పుస్తకాన్ని రచయిత ఎంవీఆర్ శాస్త్రి పరిచయం చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ వాస్తవికతకు విరుద్ధంగా చేపడుతున్న కార్యక్రమాలు, అన్యాయాలు, అక్రమాలను పుస్తక రూపంలో తీసుకువచ్చామని వెల్లడించారు.

పొద్దున హంగామా...మధ్యాహ్నం నామమాత్రం



పొద్దున ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వచ్చిన సమయంలో నేతలతోపాటు హాజరైన అధికారులు



మధ్యాహ్నం రీసర్వే డీటీ, ఆర్ఐ, వీఆర్‌ఓలకే పరిమితమైన రెవెన్యూ సదస్సు

తిరుపతి అర్బన్: రెవెన్యూ సదస్సుల్లో అధికారులు నేతల హంగామా తప్ప, ఏమీ లేదని తేటతెల్లమైంది. పొద్దున సదస్సులకు అందరూ హాజరై, హంగామా చేసినా.. మధ్యాహ్నం అందరూ దుమ్మా కొట్టడంతో నామమాత్రంగా మారుతున్నాయి. రెవెన్యూ సదస్సులను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామని ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ అధికారులతోపాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. అయితే తిరుపతి అర్బన్ పరిధిలో మంగళవారం కొంక చెన్నయ్యగుంట పరిధిలోని ఆటోనగర్ గంగమ్మగుడి వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతోపాటు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, జనసేన నేత రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మీతోపాటు పలువురు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు. అయితే మధ్యాహ్నం భోజనం విరామం తర్వాత 3 గంటలకు తిరిగి రెవెన్యూ సదస్సు ప్రారంభించారు. అయితే అప్పుడు కేవలం రీసర్వే డీటీ రామచంద్ర, ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్వోలు నూతన కుమార్, శ్రీనివాసులతో సదస్సు మమ అనిపించారు. తహసీల్దార్‌తోపాటు మిగిలిన విభాగాల వారు మధ్యాహ్నం హాజరుకాలేదు. రెవెన్యూ సదస్సుకు 76 అర్జీలు మాత్రమే వచ్చాయి. అందులో 66 అర్జీలు 22ఏ సమస్యలకు సంబంధించినవి. భూ ఆక్రమణలపై 6 అర్జీలు, మరో ఇతర చిన్న చిన్న సమస్యలపై నాలుగు అర్జీలను అధికారులు అందుకున్నారు. తిరుపతి అర్బన్ పరిధిలో తిరిగి ఈ నెల 23న తిమ్మినాయుడుపాళెంలోని తిరుమలరెడ్డి నగర్ సచివాలయ పరిధిలో రెవెన్యూ సదస్సును చేపట్టనున్నారు.